
శ్రద్ధ వహిస్తే పశు సంరక్షణ

- వేసవిలో పాడి పరిశ్రమకు ఎండ తీవ్రత దెబ్బ
- మేత విషయంలో తగు జాగ్రత్తలు అవసరం
- 'సాక్షి'తో జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ అరిఫ్



పశువులకు చికిత్స చేస్తున్న పశు సహాయక సిబ్బంది (ఫైల్)



అరిఫ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులు పలు రకాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటాయి. సహజంగా 18–35 డిగ్రీల ఉష్ణోగ్రత పశువులకు సౌకర్యంగానే ఉంటాయి. ఆపై అధిక ఉష్ణోగ్రత నమోదైతే పశువులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. వడదెబ్బ కారణంగా పశువులు మృతి చెందే అవకాశ ఉంది. పశువు రోగనిరోధక శక్తి క్షీణించి పలు రకాల సమస్యలు ఎదుర్కొంటాయి. పాల దిగుబడి తగ్గి రైతు ఆర్థికంగా నష్టం వాటిల్లుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ అరిఫ్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు.

- వేసవి కాలంలో పశుగ్రాసం సమస్య వల్ల పశువుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రైతులు ముందు జాగ్రత్తగా పశువులకు టీకాలు వేయించాలి. అంతర బాహ్య పరాన్న జీవుల నివారణకు నట్టల మందులు వేయించాలి. సమతుల పోషకాలు కలిగిన దాణా, పరిశుభ్రమైన నీరు తగిన మోతాదులో పశువులకు పెట్టాలి.
- సాధారణంగా వేసవిలో జీర్ణక్రియ సమస్యలు పశువుల్లో అధికంగా కనిపిస్తాయి. పశువుకు కావలసినంత మేత లభించకపోవడం వేడి కారణంగా తక్కువ ఆహారం తీసుకోవడం, పరిశుభ్రమైన నీరు తాగకపోవడం వల్ల మలబద్ధకం, పారుడు రోగాలు వస్తాయి.
- అధిక ఉష్ణోగ్రత కారణంగా పశువులు ఎదకు రాకుండాపోతాయి. హార్మోన్ల ఉత్పత్తి తగ్గడం వల్ల పశువులలో అండాలు సరిగా ఉత్పత్తి కావు. శరీరంలో గ్లూకోజ్ పరిమాణం తగ్గటం వల్ల అండాశయాల్లో అండోత్పత్తి వ్యత్యాసాలు సంభవించి పశువులు తిరిగి పొర్లుతుంటాయి.
- వేసవిలో పశువులు నీరు ఎక్కువగా తాగి మేత తక్కువగా తింటాయి. ఈ కారణంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. పశువులు తాగేనీరు పుష్కలంగా శుభ్రంగా వుండేలా చూసుకోవాలి. నీరు అన్ని వేళలా పశువులకు అందుబాటులో ఉంచాలి. పగటిపూట పచ్చిగడ్డి, దాణా మిశ్రమాన్ని ఇచ్చి రాత్రి ఎండుగడ్డి ఇవ్వాలి. పగటిపూట ఎండు గడ్డి మేపితే పశువులు నీరు ఎక్కువగా తీసుకుని మేత తక్కువగా తింటాయి.
- పాడి పశువులు, దూడల్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఎండలోకి వదలకూడదు.
- పాకల చుట్టూ మామిడి, జామ, అవిశ, మునగ, కానుగ, సుబాబుల్ వంటి బహుళ ప్రయోజనకర మొక్కలను నీడ కోసం పెట్టాలి.
- షెడ్ల పైకప్పులకు తెల్లని రంగు వేసి, ఆపైన గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకుల్ని పరిస్తే ఎండ వేడి షెడ్ల లోపలకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయాల్లో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తడపడం మంచిది. అత్యధిక పాలనిచ్చే సంకర జాతి ఆవులకు, గేదెలకు ఫ్యాన్లను ఏర్పాటు చేయడం కూడా అవసరమే.
- ముఖ్యంగా షెడ్లలోకి గాలి ధారాళంగా ప్రసరించేలా పాకల చుట్టూ తగినంత ఖాళీ స్థలంతో పాటు, పాకల ఎత్తులో ఉండేలా నిర్మించుకోవాలి. రోజూ 2–3 సార్లు నీటిని చల్లడం, తడి గోతాలు పరచడం వల్ల ఉపశమనం కలిగించవచ్చు తద్వారా పాడి పరిశ్రమను ఎండ తీవ్రత నుంచి కాపాడుకోవచ్చునన్ని ఆయన వివరించారు.

రెండు మండలాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గర్భిణికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

ఐరాల: జీవనశైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం వ్యాపకంగా చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. గురువారం మండలంలోని నెల్లిమందపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 60 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. శారీరక శ్రమతో పాటు ప్రతి రోజు యోగా, ధ్యానం చేయాలన్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఇంటింటికీ పేదలకు వైద్య సేవలు

తవణంపల్లె: ఇంటింటికీ పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 27 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు, మాత్రలు అందజేశారు. గర్భిణులు, 104, 108 వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు భుజించాలని సూచించారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వర్క్‌ఆర్డర్ క్లోజ్ చేయకపోతే రిలీవ్ చేస్తా



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, పక్కన ఈఈ మునిచంద్ర

- వ్యవసాయ సర్వీసుల ఇవ్వడానికి మీకేం సమస్య?
- ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను క్లోజ్ చేయకపోతే ఏఈలను రిలీవ్ చేస్తానని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ హెచ్చరించారు. గురువారం చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ కార్యాలయాల్లో వేర్వేరుగా అధికారులతో సమీక్షించారు. పైపల్లె, ఐరాల, యాదమరి, రెడ్డిగుంట సెక్షన్ల ఏఈలు ఒకొక్కరు రూ.6 కోట్ల మేరకు విలువైన 200 వర్క్ ఆర్డర్లు పెండింగ్‌లో పెట్టుకున్నారని, మెటీరియల్ కొరతతో వ్యవసాయ సర్వీసులు విడుదల చేయలేకపోయామన్నారు. ప్రస్తుతం జిల్లా స్టోర్స్‌లో మెటీరియల్ వచ్చినా క్షేత్రస్థాయిలో సర్వీసుల ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చిత్తూరు అర్బన్‌లో 900, రూరల్స్‌లో 400, పుంగనూరు డివిజన్‌లో 1900 సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని ఒకింత మండిపడ్డారు. కార్వేటినగరంలో సర్వీసుల విడుదలలో జాప్యం చేస్తున్నారని, గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. 11 కేవీ లైన్లను సర్వే చేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. సెక్షన్ల వారీగా లోడ్ మానిటరింగ్ చేసి ఎక్కడెక్కడ ఓవర్‌లోడు ఉందో గుర్తించాలన్నారు. జిల్లాకు ఆరు సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయన్నారు. చిత్తూరు అర్బన్ డివిజన్‌లో 4, పుంగనూరు డివిజన్‌లో 2 కేటాయించారన్నారు. వీటి కోసం అధికారులు స్థలం చూసి నివేదిక ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, సురేష్, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈలు ప్రసాద్, ఆనంద్, కొండయ్య, ఏఈ, సబ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

దర్గాకు చాదర్ సమర్పణ



దర్గాకు చాదర్‌ను తీసుకెళుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు తేనబండ పరిధిలోని హజరత్ సయ్యద్ మురావత్ అలీషా దర్గాలో గురువారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి నుంచి దర్గా వరకు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి 200 బైక్‌లతో ర్యాలీగా వచ్చి పాల్గొన్నారు. ఆయన్ని దర్గా కమిటీ సభ్యులు సన్మానించి, ఆహ్వానం పలికారు. అనంతరం ఆయన చందనం పూజ సామగ్రిని సమర్పించారు. స్థానికులతో పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు అత్తు, చింటూ, నవాజ్, నౌషాద్, ఆను, ముజీబ్, అల్తాఫ్, నాజీరా, షేరు, కుయ్యా, ఇమ్రాన్, షాజాన్, రియాజ్, చాను, లల్లు, రహమతుల్లా, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కేపీ శ్రీధర్, నాయకులు అప్పు, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఆందోళన

చిత్తూరు రూరల్(కాణిపాకం): సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని గురువారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది ఆందోళనకు దిగారు. ప్రతినెలా జీతాల చెల్లింపులో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్‌కు అప్పగించినప్పటి నుంచి జీతాల్లో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. గతంలో ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తుండగా, ప్రస్తుతం 15వ తేదీ పైన జీతాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసనను తెలుసుకున్న కాంట్రాక్టర్ వెంటనే ఆస్పత్రికి వద్దకు చేరుకుని, జీతాలు సకాలంలో చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనకు తెరపడింది.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూద్దాం

– మండల సర్వసభ సమావేశంలో సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళెం: వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ అమరావతి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల ఎమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. సమావేశానికి ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌ఆర్టీసీ, ఎక్సైజ్, సాంఘిక సంక్షేమశాఖ, సెరికల్చర్ అధికారులు గైర్హాజరైతే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎలా పరిష్కరించాలన్నారు. మూడు నెలలకొకసారి జరిగే సమావేశాలకు సంబంధిత అధికారులు రాకపోతే ఎలా? అని ప్రశ్నించారు. మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు సక్రమంగా వెళ్లి పనిచేస్తున్నారా? లేదా సంబంధిత ఉన్నతాధికారులు కేంద్రాలను తనిఖీ చేస్తున్నారో? లేదో తెలియడం లేదని సభ్యులు సీడీపీఓ వాణిశ్రీ దేవిని ప్రశ్నించారు. చాలా గ్రామాల్లో కార్యకర్తలు వెళ్లడంలేదని, అలాంటి వారిని గుర్తించి రిపోర్టు తయారు చేయాలన్నారు. మండలంలో మారుమూల అటవీ సరిహద్దు గ్రామాల్లో రైతులు ఏనుగుల దాడులతో ఆందోళన చెందుతున్నారని, అటవీశాఖ అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడ్డారు. ఫారెస్టు సెక్షన్ అధికారి ఎవరనేది కూడా తెలియడం లేదన్నారు. సమావేశానికి సెక్షన్ అధికారి రాకుండా రాగిమానుపెంట బీట్ ఆఫీసర్ వచ్చారని, అటవీశాఖకు సంబంధించి ఏమి జరుగుతోందో వివరాలెలా తెలుస్తాయని ప్రశ్నించారు. సమావేశాలకు రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశానికి పలువురు సర్పంచులు హాజరు కాలేదు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఆసీఫ్, తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ శ్రీధర్, సభ్యులు పాల్గొన్నారు.

మండలానికి వందశాతం పాఠ్య పుస్తకాలు



పాఠ్యపుస్తకాల గోడౌన్‌ను పరిశీలిస్తున్న వెంకటరమణనాయుడు

బంగారుపాళెం: విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలను అందజేయాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి వెంకటరమణ నాయుడు అన్నారు. మండల కేంద్రం బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పాఠ్యపుస్తకాల గోడౌన్‌ను గురువారం ఆయన సందర్శించారు. మండలానికి వంద శాతం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఎంశ్రీ కింద చేపట్టిన క్రీడా కోర్టుల నిర్మాణాలు, పనులపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 రమేష్ బాబు, హెచ్‌ఎం రాజేంద్రన్, ఉపాధ్యాయులు జగదీష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరులో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడ్డ లోకనాథ నాయుడు (74) గురువారం మృతి చెందాడు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం.. గుడిపాల మండలం పేయనపల్లెకు చెందిన లోకనాథనాయుడు చిత్తూరు దుర్గానగర్ కాలనీకు చెందిన తన కుమార్తె వద్దకు వచ్చాడు. ఈనెల 6వ తేదీ ఇంట్లో గ్యాస్ స్టౌ వెలిగిస్తుండగా, పైపు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించి లోకనాథ నాయుడుకు గాయాలయ్యాయి. బాధితుడిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సంకటహర గణపతి చతుర్థి

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం సంకటహర గణపతి చతుర్థి నిర్వహించనున్నట్టు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటలకు వ్రతం జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు.

వర్షంతో ఉపశమనం



మండల కేంద్రంలో కురుస్తున్న వర్షం

ఐరాల: మండలంలో రెండు వారాలుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు గురువారం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ సాయంత్రం మబ్బులు కమ్ముకుని ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో జనం కాస్త ఊపిరి పీల్చుకున్నారు. గాలీవాన కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వరి కోతల సమయంలో అకాల వర్షంతో నూర్పిడికి ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

క్రీడల్లోనూ రాణించాలి



చిత్రలేఖన శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఐరాల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గ్రంథాలయాధికారి సుజాత సూచించారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు కథలు రాయిడం, చదవించడం, బొమ్మలు తయారు చేయడం, గీయడం, చెస్, క్యారమ్స్, నీతి కథలు చదివించడం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని తెలిపారు. వేసవి సెలవుల్లో చిన్నారులు ఆటాపాటలతో విజ్ఞానం పెంపొందించుకునేలా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో బాలాజీ పాల్గొన్నారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీలో సత్తా చాటారు



పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న ప్రిన్సిపల్ యోగానంద్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలో మిట్టూరులోని ప్రతిభా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులు పాలిసెట్, ఏపీఆర్‌జేసీలో ప్రతిభ చాటారని కరస్పాండెంట్ మునీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ యోగానంద్ తెలిపారు. గురువారం ఆ కేంద్రంలో ర్యాంకర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఏపీఆర్‌జేసీ ఎంపీసీలో తుషారిక 109 మార్కులతో 753వ ర్యాంకు, యశ్విత 91 మార్కులతో 2370వ ర్యాంకు, పాలిసెట్‌లో యశ్విత 101 మార్కులతో 4,250వ ర్యాంక్, తుషారిక 100 మార్కులతో 4392, వాసవి 100 మార్కులతో 4468, ఢిల్లీ ప్రసన్న 90 మార్కులతో 8933వ ర్యాంకు సాధించారన్నారు కార్యక్రమంలో అధ్యాపకులు పద్మనాభరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


భూ తగాదాలు పరిష్కారం



భూముల వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

తవణంపల్లె: మండలంలోని కె.పట్నం రెవెన్యూలో అన్నదమ్ముల మధ్య ఉన్న భూ తగాదాకు సంబంధించి ఆ భూమిని పరిశీలించి, పరిష్కరించినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. కె.పట్నం రెవెన్యూ లెక్కల్లో ఉన్న సర్వే నంబర్ 454, 434లో సుమారు 3 ఎకరాల భూమిని పరిశీలించి, అన్నదమ్ములకు భాగపరిష్కారం చేయించామన్నారు. అలాగే మండలంలోని ప్రభుత్వ భవనాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాలు ఎన్ని వినియోగంలో ఉన్నాయి, ఎన్ని నిరుపయోగంగా ఉన్నాయని పరిశీలించి పూర్తి వివరాలతో నివేదికను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

పల్లెచెరువు రోడ్డుకు మహర్దశ



అరగొండ రోడ్డు నుంచి పల్లె చెరువుకు వేసిన తారురోడ్డు

తవణంపల్లె: మండలంలోని పల్లెచెరువు రోడ్డుకు మహర్దశ వచ్చింది. పల్లెచెరువు రోడ్డు గుంతలమయమై కంకర తేలి, వాహనాలు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కింద తారురోడ్డు నిర్మాణానికి రూ.31 లక్షలు మంజూరైంది. దీనితో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. అరగొండ ప్రధాన రహదారి నుంచి పల్లెచెరువు వరకు 2.3 కిలోమీటర్లు వరకు గుంతలు పూడ్చి వేసి తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు పీఆర్ ఏఈ జయచంద్రారెడ్డి తెలిపారు. అలాగే అరగొండ రోడ్డు నుంచి కొండ్రాజుకాలువ వరకు 600 మీటర్ల తారురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మండలంలోని టి.పుత్తూరు రోడ్డు నుంచి రామకృష్ణాపురం వరకు తారురోడ్డు, టి.పుత్తూరు రోడ్డు నుంచి కొండకిందకనికాపురం వరకు తారురోడ్డు పనులు త్వరలో చేపట్టనున్నట్లు వెల్లడించారు.

20 లోపు వెరిఫికేషన్ పూర్తి చేయాలి

బంగారుపాళెం: మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవాలని గురువారం తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ కోరారు. ఈ నెల 20వ తేదీ వరకు వెరిఫికేషన్‌కు అవకాశం ఉందన్నారు. ఆధార్ నంబర్ తప్పుగా ఉన్నా, భూమి విస్తీర్ణంలో తప్పులు ఉన్నట్లైతే సరిద్దికునేందుకు వీలుందన్నారు. దీనికిగాను ఎడిట్ ఆప్షన్ ఇచ్చారన్నారు. సంబంధిత అధికారులను సంప్రదించి అప్రూవ్ చేసుకోవాలన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

–జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

యాదమరి: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీఅన్నారు. గురువారం మండలంలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో పదవ సబ్ జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ చాంపియన్‌షిప్ బాస్కెట్ బాల్ పోటీలను జిల్లా కలెక్టర్, పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీ మోహన్, డీఎఫ్‌ఓ భరణి ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఈ పోటీలు నాలుగు రోజులపాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

మినీ అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలి



పీడీ వెంకటేశ్వరికి వినతి పత్రం ఇస్తున్న గంగరాజు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ఇవ్వాలని గురువారం సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంగరాజు ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరికి వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎండలు తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, జిల్లాలో కూడా ఎండ ఎక్కువగా ఉందన్నారు. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చినప్పటికీ చిన్నపిల్లలు ఉంటున్న అంగన్‌వాడీ సెంటర్లకు సెలవులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వేతనాలు పెంచాలని గతంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నూతన పద్ధతులు అవలంబించాలి

చిత్తూరు రూరల్(కాణిపాకం): రైతులు వ్యవసాయ రంగంలో నూతన పద్ధతులు అవలంబించి, అధిగ దిగుబడి సాధించాలని ఏఓ వేణు పేర్కొన్నారు. చిత్తూరు మండలంలోని చెర్లోపల్లిలో గురువారం జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కొనసాగింది. ఆయన వ్యవసాయ ప్రాముఖ్యతను రైతులు, విద్యార్థులకు వివరించారు. సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ప్రతిమారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు శైలజ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
S.O.P.NO. 6 OF 2025

Between:
1) V.Balasubramanyam ,
2) V.N.Srinivasulu. 1 & 2 Sons are S/o Late V. Narayanaswamy Both are residing at D.No.4-779, 1st Marati Street, Greamspet, Chittoor Town and Dist ...Petitioners
And
V.Manjula, D/o Late V.Narayanaswamy W/o N.Subranayam, residing at Basavapalli Village,Gudipala Mandal, Chittoor Dist. ...Respondent

GENERAL NOTICE

The petitioners have filed the above O.P. requesting this Hon'ble court to issue succession certificate in their favour by declaring them as successors for getting amount **Rs.76,468/- with accrued interest thereon from Indian Bank, Greamspet Branch, Chittoor lying in the Name of V.Narayanaswamy vide S.B. A/c No.504691880.** The said OP is posted to **03.07.2025** calling for objectors. If any body got objection they may appear on **03.07.2025** at 10.30 A.M. either in person or through an Advocate and file objections if any.

(By order of this Hon'ble Court)

K.JANAKIRAMA REDDY
Advocate for Petitioners
Place:Chittoor, Date:16-05-2025